సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 23 । మే । 2023



యువకుడి దారుణ హత్య

తన కంటే ఎక్కువ ఇటుకలు కోస్తున్నాడన్న అక్కసుతో ఓ యువకుడిని కూరగాయలు కోసే కత్తితో దారుణంగా హత్య చేసిన ఘటన కోవూరు మండలంలో సోమవారం జరిగింది.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,790
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,639
3 శాతం జీఎస్టీతో	రూ.5,808
సవర (8 గ్రా)	రూ.46,464

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.5 /29.0

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. గాలిలో 70 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

టీచర్లకు రెండో విడత శిక్షణ ప్రారంభం



టీచర్లకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(టౌన్): 1998, 2008, డీఎస్సీ (ఎంటీఎస్), 2018 డీఎస్సీలో ఎంపికైన ఎస్జీటీలకు రెండో విడత జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని డైట్ ప్రిన్సిపల్ రమేష్ నెల్లూరులోని స్టోన్‌హౌస్ పేటలో ఉన్న ఆర్‌ఎస్‌ఆర్ మున్సిపల్ పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమం 26వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కోర్స్ డైరెక్టర్‌గా డీఈఓ గంగాభవాని వ్యవహరించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో 46 మండలాల నుంచి 300 మంది టీచర్లు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు వెల్లడించారు. డైట్ అధ్యాపకులు బాలాజీరావు, ఉపన్యాసకులు బి.దాస్, విజయచంద్ర, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో నైపుణ్యాలు పెంచుకోవాలి

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



శిక్షణకు హాజరైన ఎంఎల్‌హెచ్‌పీలు

నెల్లూరు(అర్బన్): వైద్య వృత్తిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా శిక్షణ పొందుతూ నైపుణ్యాలను పెంచుకోవాలని జిల్లా వైద్యశాఖాధికారి పెంచలయ్య సూచించారు. నూతనంగా విధుల్లో చేరిన మల్టీలెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీఎస్)కు నెల్లూరు దర్గామిట్టలో ఉన్న మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో బేసిక్ లైఫ్ సేవింగ్ స్కిల్స్‌పై శిక్షణను ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. వారంరోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు డాక్టర్లతో సమానమన్నారు. ఈ సందర్భంగా పాముకాటు, తేలుకాటు, గాయాలు, స్ట్రోక్ తదితరాలకు సంబంధించి చేయాల్సిన ప్రథమ చికిత్సల గురించి నిపుణులు వివరించారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ హరిశ్చంద్ర సతీష్, డాక్టర్లు బ్రహ్మేశ్వర్, రమాదేవి, నీలిమ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్



నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట): ఫుట్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా నెల్లూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బాపనపల్లి చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల తిరుపతిలో ఫుట్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించిన విషయం తెలిసిందే. నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్‌కు రాష్ట్ర అసోసియేషన్‌లో చోటు దక్కడంపై జిల్లా నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు.

వెబ్‌సైట్‌లో ఇంటర్ సప్లిమెంటరీ హాల్‌టికెట్లు

నెల్లూరు(టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి హాల్‌టికెట్లను https:://bie.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆర్‌ఐఓ వరప్రసాద్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల వారు తమ పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్ నంబర్‌ను ఉపయోగించి సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్‌ను స్వయంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. వాటిపై ఫొటోలు, సంతకాలు, ఇతర సవరణలు అవసరమైన విద్యార్థులు తమ కళాశాల ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై ప్రిన్సిపల్ సంతకం ఉండాల్సిన అవసరం లేదన్నారు.

సోమశిలలో 44.468 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 44.468 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 181 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 3,200 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 95.172 మీటర్లు ఉంది.

నిమ్మ సాగులోనే జీవితం

నిమ్మ తోటల సాగు.. జిల్లాలోని కొన్ని మండలాల్లో ఎంతోమంది రైతుల జీవనాధారం. కొంతకాలంగా సకాలంలో వర్షాలు కురిసి దిగుబడి పెరగడంతో అన్నదాతలు ఆర్థిక స్వావలంబన పొందుతున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మొదలుపెట్టిన జలయజ్ఞం రైతాంగానికి బాగా ఉపయోగపడింది. ఈ ప్రాంతంలో కాలువలను తవ్వించడంతో తోటలకు నీటి వసతి పెరిగింది. పొదలకూరులో నిమ్మ మార్కెట్ యార్డు (ప్రభుత్వ) ఉండడం అనుకూలంగా మారింది.

- మెట్ట రైతుల అభిప్రాయం
- దశాబ్దాలుగా జీవనాధారం
- ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- సబ్సిడీపై డ్రిప్ పైపుల ఏర్పాటు
- ధరలను శాసిస్తున్న ఢిల్లీ మార్కెట్



పొదలకూరు మండలంలో లేత నిమ్మ తోటలు

పొదలకూరు: నిమ్మ తోటల సాగు లాభదాయకంగా ఉంది. ఇది అనేకమంది రైతుల మాట. ఇతర పంటలతో పోల్చి చూసుకుని నిమ్మ సాగే మేలంటున్నారు. జిల్లాలో నిమ్మ తోటల సాగు పొదలకూరు, చేజర్ల, కలువాయి, రాపూరు, సైదాపురం, వింజమూరు, మనుబోలు, వెంకటాచలం తదితర మండలాల్లో అధికంగా ఉంది. 4 వేల మంది రైతులు సాగు చేస్తుంటారని అధికారుల అంచనా. ఒకప్పుడు నీటి వసతి లేకపోవడం, ఇతర కారణాలతో తోటలను నరికేసిన రైతులు నేడు నిమ్మ మొక్కలను నాటేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 20 వేల హెక్టార్లు నిమ్మ సాగులో ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.



యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

అంతర్జాతీయ మార్కెట్

నిమ్మకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ ఏర్పడడం కూడా రైతులకు కలిసొచ్చే అంశం. ఢిల్లీ మార్కెట్ నుంచి విదేశాలకు సైతం నిమ్మ ఎగుమతి జరుగుతోంది. మార్కెట్ విస్తరించి ధరలు పెరుగుతుండడంతో ఇక్కడి రైతులకు లాభాలు వస్తున్నాయి. దీంతో వరి సాగును తగ్గించి మెట్ట పంటైన నిమ్మపైనే ప్రధానంగా ఆధారపడుతున్నారు. ఫలితంగా ప్రతి ఏడాది జిల్లాలో నిమ్మ సాగు పెరుగుతోంది. గతేడాది రికార్డు స్థాయిలో ఒక బస్తా (లూజు) రూ.16 వేలు ధర పలికింది.

జిల్లాలో..

నిమ్మ సాగు విస్తీర్ణం :	17 వేల హెక్టార్లు
సీజన్లో పొదలకూరు యార్డు నుంచి.. ఎగుమతులు :	20 లారీలు (రోజుకి)
ప్యాక్ చేసి ఎగుమతి చేసే కాయలు :	120 టన్నులు

ప్రోత్సాహం ఇలా..

నిమ్మ తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. పునరుద్ధరణ పథకం కింద ముదురు తోటలను తొలగించి మొక్కలను నాటుకుంటే హెక్టార్‌కు రూ.17,700 ఇస్తున్నారు. రైతులు నర్సరీల వద్ద బిల్లులు తీసుకుని ఉద్యాన శాఖకు సమర్పిస్తే ఉద్యానాధికారి నాటిన మొక్కలను ఫొటోలు తీసుకుని నివేదికలు రూపొందించి నగదు ఇస్తారు. కాగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మాత్రం చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహం లభిస్తోంది. ఎస్సీ, ఎస్టీలు 10 ఎకరాల్లోపు, ఓసీ, బీసీలు 5 ఎకరాల్లోపు నిమ్మ సాగు చేసుకుంటే రాయితీలను అందజేస్తున్నారు. సేద్యం ఖర్చులను కూడా ఉపాధి హామీ కిందే పంపిణీ చేస్తున్నారు. వైఎస్సార్ జలకళ ద్వారా తోటల్లో ఉచితంగా బోర్లు వేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం బోరు, కేసింగ్ పైపు, మోటార్, విద్యుత్ సౌకర్యం మొత్తం కలిపి ఒక్కో రైతుకు రూ.3 లక్షల వరకు ఖర్చు చేస్తోంది.

సబ్సిడీపై..

సూక్ష్మ సేద్యం పథకం కింద సబ్సిడీపై నిమ్మ తోటలకు డ్రిప్ పైపులను అందజేస్తున్నారు. ఐదు ఎకరాల్లోపు వారికి 90 శాతం, 5 నుంచి 10 ఎకరాల్లోపు వారికి 70 శాతం రాయితీలను డ్రిప్ పైపుల పంపిణీపై ఇస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటులో పొదలకూరు మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంది. 472.87 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం కింద డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్లను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ఉద్యాన, ఏపీఎంఐ శాఖలు అందిస్తున్న రాయితీలను రైతులు సకాలంలో సద్వినియోగం చేసుకుంటున్నారు.

విస్తీర్ణం పెరుగుతోంది



ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలు మొత్తం కలిపి నాలుగు వేల హెక్టార్లలో సాగవుతుంటే ఒక్క నిమ్మ 3,300 హెక్టార్లలో ఉంది. కాయల ధరలు బాగా పెరగడంతో రైతులు నిమ్మ సాగుపై మక్కువ చూపుతున్నారు. ఈ ప్రాంత రైతులకు నిమ్మ సాగుతో విడదీయలేని బంధం ఏర్పడింది. నష్టం, కష్టం వచ్చినా నిమ్మ సాగును వదులుకునేందుకు సిద్ధంగా లేరు.

– ఈ.ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

రైతులకు భరోసా



పొదలకూరులో గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప యాత్రలో నిమ్మ రైతులకు భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్నారు. నిమ్మకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి.

– వి.దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

మార్కెట్ ఆటుపోట్లు



ప్రతి ఏడాది నిమ్మకాయల ధరలు ఒకేలా ఉండవు. కాయల నాణ్యత, డిమాండ్, వాతావరణం తదితర అంశాలను బట్టి ఢిల్లీ మార్కెట్ ధరలను నిర్ణయిస్తుంది. ఈ ఏడాది గతేడాదితో పోల్చిచూస్తే 50 శాతం ధరలే ఉన్నాయి. అయితే ఇప్పుడు ధరలు తక్కువగా లేకున్నా రైతులు ఊహించినంతగా లేవు.

– ఎం.బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, నిమ్మ మార్కెట్ యార్డు, పొదలకూరు

ధరల్లో వ్యత్యాసం



ఢిల్లీ మార్కెట్ ప్రకారం ఇక్కడ యార్డులో ధరలు నిర్ణయిస్తారు. ఈ ఏడాది ధరలు చెప్పుకోదగిన స్థాయిలో లేకున్నా రైతులకు గిట్టుబాటవుతున్నాయి. నిమ్మ సాగు వల్ల నష్టపోతున్న రైతులు అరుదుగా ఉంటారు. సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఇంతకంటే వ్యవసాయం ఉండదు.

– ఎం.శంకర్‌రెడ్డి, రైతు, ముదిగేడు

గుట్టుగా గంజాయి తరలించే యత్నం

- చెన్నై నుంచి ఆర్డర్..
- కావలిలో ఆరుగురి అరెస్ట్
- 50 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ

నెల్లూరు(క్రైమ్): చెన్నైకి చెందిన కొందరు గంజాయి కావాలని ఆర్డర్ ఇచ్చారు. ఆరుగురు వ్యక్తులు సరుకును గుట్టుగా రవాణా చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నిందితుల వివరాలను సోమవారం వెల్లడించారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కసర్లపూడి గ్రామానికి చెందిన జి.అనంత శివప్రసాద్, శరభవరం గ్రామానికి చెందిన కె.శ్రీను, రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన వి.రాజు, విశాఖపట్నం మద్దిలపాలేనికి చెందిన జి.రాజు, సీతమ్మధారకు చెందిన కె.ప్రేమ్‌కుమార్, మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన ఎ.రాజేష్ కారు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇంకా వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారు ఒడిశా బార్డర్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో గంజాయి సేకరించి చెన్నైకి చెందిన కార్తీక్, సురేష్‌కు కేజీ రూ.5 వేలు చొప్పున విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. ఈ నేపథ్యంలో ఈనెల 21వ తేదీన నిందితులు రెండు కార్లలో 50 కేజీల గంజాయిని తీసుకుని చెన్నైకు బయలుదేరారు.

పక్కా సమాచారంతో దాడులు

గంజాయి అక్రమ రవాణాపై కావలి డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ ఎం.రాజేష్‌కు పక్కా సమాచారం అందింది. దీంతో 21వ తేదీన కావలి హైవేపై వాహన తనిఖీలు చేపట్టారు. ఓ హోటల్ సమీపంలో రెండు కార్లు ఆగాయి. అందులోని ఆరుగురు వ్యక్తులు భోజనం చేసేందుకు వెళ్తుండగా పోలీసులు గమనించారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. కార్లను తనిఖీ చేయగా అందులో 50 కేజీల గంజాయిని గుర్తించారు. నిందితులను స్టేషన్‌కు తరలించి విచారించగా చెన్నైకు చెందిన గంజాయి విక్రేతలు కార్తీక్, సురేష్‌కు ఆర్డర్‌పై సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి రెండుకార్లను, గంజాయిని సీజ్ చేశారు. సీజ్ చేసిన సొత్తు విలువ రూ.10 లక్షలు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు.

నిందితులపై పలు కేసులు

పట్టుబడిన నిందితుల్లో అనంత శివప్రసాద్‌పై విశాఖపట్నం కేడీ పేట పోలీస్‌స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ యాక్ట్, రోలుగుంట, విశాఖపట్నం ద్వారకా స్టేషన్ పరిధిలో కేసులున్నాయి. కె.శ్రీనుపై రోలుగుంట స్టేషన్‌లో, ఎ.రాజేష్‌పై రోలుగుంట స్టేషన్, విశాఖపట్నం పీఎం పాలెం స్టేషన్‌లో గంజాయి కేసు ఉందని ఎస్పీ తెలిపారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణా నేరమన్నారు. గంజాయి సేవించే వారిపై సైతం కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దీనికి దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ డి.హిమవతి, కావలి డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ రాజేష్, కావలి రూరల్ ఎస్సై ఎం.వెంకట్రావు, హెడ్‌కానిస్టేబుల్స్ ఆర్.రాధయ్య, జి.మాధవ, కానిస్టేబుల్స్ జె.ఆయోధ్య కుమార్, షేక్ ఇర్షాద్, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగదు కోసం వచ్చి.. తిరిగి వెళ్లలేక..

- చార్జీలకు డబ్బుల్లేక దంపతుల అవస్థ
- మానవత్వం చాటిన నెల్లూరు డీఎస్పీ



దంపతులకు నగదు ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరుకు రండి డబ్బులిస్తానని బేల్దారి మేస్త్రీ చెప్పాడు. దంపతులు ఇక్కడికి వస్తే అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. కడుపు నిండా అన్నం తిని ఐదురోజులైంది. చార్జీలకు డబ్బు ఇప్పిస్తే ఊరు వెళ్లిపోతామని పలువురిని అడిగారు. వారి పరిస్థితిని గమనించిన నెల్లూరు నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటారు. వివరాలు.. హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో జి.కిరణ్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు భార్య, నాలుగు సంవత్సరాల కుమార్తె ఉంది. ప్రస్తుతం భార్య నిండు గర్భిణి. అతను బేల్దారి పనులు చేస్తూ వచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నెల్లూరుకు చెందిన గురుస్వామి ఎల్‌బీ నగర్‌లో భవన నిర్మాణ మేస్త్రీగా పనులు చేస్తున్నాడు. కిరణ్ అతడి వద్ద రోజుల తరబడి పనులు చేశాడు. రూ.20 వేలు రావాల్సి ఉంది. ఈ క్రమంలో మేస్త్రీ నెల్లూరుకు వచ్చేశాడు. దీంతో కిరణ్ అతడికి ఫోన్ చేసి కూలి డబ్బు అడగ్గా నెల్లూరుకు వస్తే ఇస్తానని చెప్పా డు.

ఇక్కడికి వచ్చి..

గర్భిణి అయిన భార్యను ఒంటరిగా వదిలిరావడం ఇష్టం లేని కిరణ్ ఆమె, కుమార్తెను తీసుకుని ఈనెల 16వ తేదీన నెల్లూరుకు వచ్చాడు. మేస్త్రీకి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆయన ఫోన్ ఆన్ చేయకపోతాడా? అని వేచి చూడసాగాడు. ఈ నేపథ్యంలో కిరణ్ తెచ్చుకున్న నగదు పూర్తిగా అయిపోయింది. భార్యను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించాడు. ఐదురోజులుగా అక్కడ పెట్టే భోజనం, ట్రస్ట్ అందించే ఆహారం తింటూ ఉండిపోయారు. వారి సమస్యను విన్న సిబ్బంది కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే స్పందనలో ఫిర్యాదు చేయమని చెప్పారు. దీంతో కిరణ్ తన భార్య, కుమార్తెతో కలిసి సోమవారం కార్పొరేషన్ అధికారులను కలిసి జరిగిన విషయాన్ని చెప్పారు. ఆయన నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని కలవాలని సూచించారు. డీఎస్పీ కార్యాలయానికి ఎలా వెళ్లాలో తెలియక జిల్లా పోలీస్ కార్యాలయంలో జరుగుతున్న స్పందనకు వెళ్లారు. అక్కడ సిబ్బంది డీఎస్పీకి ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశారు. డీఎస్పీ పోలీస్ కార్యాలయానికి చేరుకుని దంపతులతో మాట్లాడారు. బేల్దారి మేస్త్రీకి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆ నంబర్‌ను ట్రేస్ చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. భోజనం చేశారా? ఎక్కడుంటున్నారు? అని శ్రీనివాసరెడ్డి ఆరా తీశారు. 'నా భార్య కడుపుతో ఉంది, నొప్పులు వచ్చేలా ఉన్నాయి. కడుపు నిండా అన్నం తిని రోజులవుతోంది. మాకు ఏమి వద్దు సార్. చార్జీలకు డబ్బులిప్పిస్తే ఊరు వెళ్లిపోతాం.' అని కిరణ్ కోరాడు. దీంతో డీఎస్పీ వారిని ఓదార్చి వెంటనే కొంత నగదు ఇచ్చి గ్రీవెన్స్‌లో భోజనం చేయండి. నేను కొద్దిసేపట్లో వస్తానని చెప్పారు. పోలీసు కార్యాలయంలో పనులు చేసుకుని బయటకు వచ్చి వారు ఊరు వెళ్లేందుకు బస్సు టిక్కెట్ బుక్ చేయించి ఖర్చులకు కొంతనగదు ఇచ్చారు. దీంతో వారు డీఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు భూ హక్కులు

పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. వారి సొంతింటి కల సాకారం చేసేందుకు చర్యలు తీసుకుంది. మహిళల పేరు మీద పట్టాలు ఇచ్చింది. శరవేగంగా ఇళ్లు కట్టిస్తోంది. అలాగే చుక్కల భూములకు విముక్తి కల్పించి రైతులకు సర్వ హక్కులు కల్పించారు. మరో బృహత్తర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు. ప్రభుత్వ భూములను ఏళ్లుగా దుక్కి దున్ని సాగు చేస్తున్నా ఎలాంటి హక్కు లేకుండా అనేకమంది కాలం వెళ్లదీస్తున్నారు. వారికి పట్టాలు అందించేందుకు సిద్ధమయ్యారు.

- నాడు వైఎస్సార్ హయాంలో పంపిణీ
- నేడు మండలాల వారీగా జాబితాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- మూడువేలకు పైగా లబ్ధిదారులు.. మూడువేలకు పైగా ఎకరాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న అసైన్డ్ భూముల సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కొంతకాలం క్రితం ఉత్తర్వులు సైతం జారీ చేశారు. సీఎం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం అర్హుల జాబితాను రూపొందించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన కొనసాగే అసైన్డ్ కమిటీ అర్హుల జాబితాను ప్రభుత్వానికి పంపింది. అక్కడ ఆమోద ముద్ర పడగానే పేదలు సాగు చేసుకుంటున్న భూమిపై సర్వ హక్కులు సిద్ధిస్తాయి. డీ పట్టాలు పంపిణీ చేస్తారు.

అర్హుల ఎంపికకు ప్రత్యేక కమిటీ

సాగు భూమికి సంబంధించి రైతులకు పట్టాలిచ్చేందుకు ప్రత్యేకంగా అసైన్‌మెంట్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చైర్మన్‌గా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కన్వీనర్‌గా జాయింట్ కలెక్టర్, సభ్యులుగా జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీలు ఉంటారు. ప్రభుత్వ ప్రకటన అనంతరం వీలైనంత త్వరలో పట్టాలు అందజేసేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

అర్హతలు

సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి తప్ప రైతులకు ఇతరత్రా పట్టా భూమి ఉండకూడదు. దరఖాస్తులో పొందుపరిచిన భూమిలో సదరు రైతు తప్పనిసరిగా సాగు చేసుకుంటూ ఉండాలి. అన్ని అర్హతలతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో జరిగే అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదం పొందాలి. అర్హత ఉన్న రైతుకు 2.50 ఎకరాలు, మెట్ట ఐదెకరాలు మించకుండా డీ పట్టా మంజూరు చేస్తారు.

జిల్లాలో పట్టాలకు ప్రతిపాదించిన సాగు భూమి జాబితా

రెవెన్యూ డివిజన్	లబ్ధిదారులు	ఎకరాలు
నెల్లూరు	2,441	2411.81
కావలి	531	700.75
ఆత్మకూరు	443	557.71
కందుకూరు	47	39.35

ఈ భూములు ఇవ్వరు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోరంబోకు భూములు, వాగులు, వంకలు, కొండలు, గుట్టలకు సంబంధించి పట్టాలు ఇవ్వరు. వ్యవసాయ యోగ్యమైన భూమిని మాత్రమే అసైన్డ్ చేస్తూ డీ పట్టా ఇస్తారు. గతంలో పట్టాలిచ్చిన, ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించే ఆలోచన ఉన్న భూములను రైతులకు పట్టాలు ఇవ్వరు.

అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నాం



అర్హులైన పేద వర్గాలకు భూ హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. జిల్లాలో నియోజకవర్గాల వారీగా పట్టాల పంపిణీకి జాబితాలు సిద్ధం చేస్తున్నాం. ఇది కేవలం జాబితా మాత్రమే. ఇంకా మార్పులు జరిగే అవకాశం ఉంది. అసైన్డ్ కమిటీ అప్రూవల్ కావాల్సి ఉంది.

– రోణంకి కూర్మనాథ్, జేసీ

అప్పట్లో..

పేదలకు భూ హక్కులు కల్పించే కార్యక్రమాన్ని కొన్ని సంవత్సరాలుగా ఎవరూ చేపట్టలేదు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో భూ హక్కులు కల్పించారు. సుదీర్ఘ కాలం అనంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్ హయాంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సీఎం నిర్ణయంపై పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు భూమి కావాలన్న కొన్నేళ్ల కోరిక నెరవేరనుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బైక్ చోరీ.. ఆపై దారి దోపిడీ

- వ్యాన్‌లోని ఇద్దరు వ్యక్తులపై దాడి
- నగదు, ఫోన్ల అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం: ఇద్దరు వ్యక్తులు మోటార్‌బైక్‌ను చోరీ చేసి అందులో వెళ్తూ దారి దోపిడీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి బుచ్చిరెడ్డిపాళేనికి ఒక బైక్‌పై వెళ్లారు. స్థానిక ఎస్‌ఎస్ కల్యాణ మండపం వీధిలో శ్రీనివాసులు ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ను ఎత్తుకెళ్లారు. అనంతరం నెల్లూరుకు బయలుదేరి మండలంలోని పెనుబల్లి వద్ద రోడ్డుకు అడ్డంగా రెండు బైక్‌లను ఉంచారు. ఆ సమయంలో బుచ్చిరెడ్డిపాళెం నుంచి నెల్లూరుకు వెళ్తున్న వ్యాన్‌ను అడ్డగించారు. అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచారు. రూ.5 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లను తీసుకుని పరారయ్యారు. వ్యానులో ఉన్న సురేష్ అనే వ్యక్తి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

354 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి: మండలంలోని కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 354 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 393 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారని, వాటిలో 39 బేళ్లను తిరస్కరించారన్నారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.170, సగటున రూ.199.72 ధర లభించింది. వేలంలో 12 కంపెనీలు పాల్గొన్నాయి.

అధికారుల నిర్లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి ప్రాధాన్యం ఇస్తూ నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేసింది.నర్సింగ్ సిబ్బందిని నియమించింది. రోగులకు పరీక్షలు నిర్వహించేందుకు అధునాతన వైద్యపరికరాలను సైతం ఈ ఆస్పత్రిలో ఏర్పాటు చేసింది. నిర్వహణకు నిధులు విడుదల చేసింది. అయితే ఆస్పత్రి అధికారులు సకాలంలో స్పందించక నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో జిల్లాకే రెఫరల్‌గా ఉన్న ఈ పెద్దాస్పత్రిలో రోగులకు రక్తపరీక్షలు సైతం అందడం లేదు. గర్భిణులకు, వృద్ధులకు, రోగుల కోసం లిఫ్ట్ ఉన్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో పై అంతస్తులకు మెట్లు ఎక్కలేక, దిగలేక వారు అవస్థలు పడుతున్నారు.


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

- జీజీహెచ్‌లో మరమ్మతులకు గురైన రక్తపరీక్షల యంత్రం
- ప్రభుత్వం నిధులిచ్చినా రిపేర్ చేయించని అధికారులు
- పనిచేయని లిఫ్ట్‌లు, సీసీ కెమెరాలు
- పది గంటలైనా ప్రారంభం కాని ఓపీ సేవలు
- అవస్థలు పడుతున్న రోగులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)కి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. ఇక్కడ రోజుకు 1,100 నుంచి 1,300 వరకు ఔట్ పేషెంట్లు, రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. ఇందులో కనీసం 400 మందికి తల్లీబిడ్డ వార్డులో వైద్యసేవలు అందుతున్నాయి. ఆస్పత్రిలో సుమారు 500 మంది ఇన్ పేషెంట్లుగా అడ్మిషన్‌లో ఉంటున్నారు. 9 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. విశాలమైన ల్యాబోరేటరీ ఉంది. సుమారు రూ.3.5 కోట్లతో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ లాంటి పరికరాలను ఏర్పాటు చేశారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎకో, ఎక్స్‌రే పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.


మరమ్మతులకు గురైన ఆటో అనలైజర్ రక్తపరీక్షల యంత్రం

మూలన పడేసిన ఆధునిక అనలైజర్

రూ.35 లక్షల విలువ చేసే ఆటో అనలైజర్ లాంటి ఖరీదైన రక్తపరీక్షల యంత్రాలు పెద్దాస్పత్రిలో ఉన్నాయి. ఈ యంత్రంలో ఒకేసారి 140 రకాల రక్తపరీక్షలు చేయవచ్చు. ఈ యంత్రం మరమ్మతులకు గురైంది. కేవలం రూ.18 వేలు ఖర్చు చేస్తే యంత్రం బాగవుతుంది. అయినప్పటికీ దీన్ని గత ఐదు నెలల నుంచి మూలన పడేశారు. ఫలితంగా పలు అత్యవసర పరీక్షలు రోగులకు అందడం లేదు. థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్, కిడ్నీకి సంబంధించి సీరంక్రియాటిన్, బ్లడ్‌గ్రూప్ టైపింగ్ లాంటి అత్యవసర పరీక్షలు ఆగి పోయాయి. ఈ పరీక్షలు బయట చేయించుకోవాలంటే సుమారు రూ.2 వేలపైనే ఖర్చవుతుంది. ఇటీవల ఓ పిచ్చి కుక్క కరిచి పెద్దాస్పత్రికి ఒకే దఫా 15 మంది బాధితులు వచ్చారు. ఆ సమయంలో రూ.6 నుంచి రూ.7 మాత్రమే ఖర్చయ్యే టీటీ(టెటనస్ టాక్సాయిడ్) లాంటి ఇంజక్షన్లు కూడా లేవు. పక్కనే ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో ప్రభుత్వం కావాల్సినన్ని ఇంజక్షన్లు స్టోర్ చేసి ఉంది. కేవలం అధికారులు సకాలంలో ఇండెంట్ పెట్టుకోనందు వల్ల పక్కనే ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ఇంజక్షన్లు పెద్దాస్పత్రికి చేరలేదని తెలుస్తోంది. బాధితులు టీటీ ఇంజక్షన్ కూడా ఆస్పత్రిలో లేదా అంటూ డాక్టర్లను తిట్టుకుంటూ బయటకు వెళ్లి ఇంజక్షన్ వేయించుకున్నారు. ఆస్పత్రి మెడికల్ ఇన్‌చార్జి నిర్లక్ష్యం వహించినా సూపరింటెండెంట్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రోగులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.


ఆలస్యంగా ఓపీ స్లిప్‌లు ఇస్తుండడంతో క్యూలో వేచి ఉన్న రోగులు

ఓపీ సేవల్లో జాప్యం

ఆస్పత్రిలో ఓపీ స్లిప్‌లు ఉదయం 8 గంటల నుంచి అందించాలి. అయితే సిబ్బంది 9 గంటల వరకు ఈ ప్రక్రియను ప్రారంభించడం లేదు. దీంతో రద్దీ విపరీతంగా పెరిగిపోయి ఒక్కోసారి తోపులాటలు జరుగుతున్నాయి. డాక్టర్లు సైతం 10 గంటల వరకు ఆస్పత్రిలోని ఓపీకి రావడం లేదు. సూపరింటెండెంట్ రౌండ్స్‌కు వెళ్లకపోవడం వల్లనే డాక్టర్లు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని తెలుస్తోంది.

కలెక్టర్ నిధులిచ్చినా..

ఆస్పత్రిలోని నూతన ఐపీ బిల్డింగ్‌లో 7 లిఫ్టులు ఉన్నాయి. ప్రసూతి విభాగంలో మరో మూడు లిఫ్టులు ఉన్నాయి. లిఫ్టులను జాన్సన్ కంపెనీ వారు మరమ్మతులు చేయాలి. వారు సంవత్సరాల తరబడి మరమ్మతులు చేయకుండా బిల్లులు సమర్పించడంతో ఆస్పత్రి అధికారులు వాటిని వెనక్కు పంపినట్లు తెలుస్తోంది. దీంతో ఆస్పత్రిలో లిఫ్టులు మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారు లేరు. బాలింతలు, నిండు గర్భిణులు, వృద్ధులు, 3, 4 అంతస్తులు ఎక్కలేక తీవ్ర అగచాట్లు పడుతున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌ను, జాన్సన్ కంపెనీ ప్రతినిధులను పిలిపించారు. 15 రోజుల క్రితం కలెక్టర్ రూ.8 లక్షలు తమ నిధుల నుంచి లిఫ్ట్‌ల మరమ్మతులకు విడుదల చేశారు. ఆస్పత్రి చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ ఆరోగ్యశ్రీ నిధులను మరో రూ.8 లక్షలు వినియోగించుకునేలా ఉత్తర్వులు ఇచ్చారు. మొత్తం రూ.16 లక్షలు విడుదల చేసి రెండు వారాలు దాటిపోయినా రెండు లిఫ్టులు మాత్రమే మరమ్మతులు చేసి మమ అనిపించుకున్నారు. మరమ్మతులు చేసిన లిఫ్టులు ఒకటి రెండు రోజులకే మళ్లీ మరమ్మతులకు గురవుతున్నాయి.

భద్రత ప్రశ్నార్థకం

పెద్దాస్పత్రిలో భద్రత కోసం 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా అందులో కేవలం 10 నుంచి 15 మాత్రమే పనిచేస్తున్నాయి, మిగిలినవన్నీ మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తత్ఫలితంగా భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

తరచూ సెలవులే

రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ల మీద నడిచిందన్న చందంగా అధికారి పట్టించుకోకపోవడంతో పలువురు డాక్టర్లు తంబ్ వేసి డ్యూటీలకు డుమ్మా కొడుతున్నారని తెలుస్తోంది. కొంతమంది డాక్టర్లు ఆస్పత్రి ప్రాంగణంలోకి వచ్చి తంబ్ వేసి అటు నుంచి అటే వెనుదిరుగుతున్నారని, బయట సొంత ప్రాక్టీసుల్లో మునిగి తేలుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ తరుచూ సెలవులు పెట్టి ఓపీ సేవలను పర్యవేక్షించకపోవడం, రౌండ్స్‌కు వెళ్లకపోవడంతోనే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వారం రోజుల్లో అన్నీ చక్కదిద్దుతా



లిఫ్ట్ మరమ్మతుల పనులు జరుగుతున్నాయి. త్వరలోనే అన్నీ అందుబాటులోకి వస్తాయి. కలెక్టర్ ఆస్పత్రికి నిధులు కూడా ఇచ్చారు. ఇక మీదట ఆస్పత్రిలో రెగ్యులర్‌గా రౌండ్స్ వేస్తా. సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటా. వారం రోజుల్లో అన్నీ చక్కదిద్ది రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తా.

– డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

సహజ నటన శరత్‌బాబు సొంతం

- నెల్లూరులో 'అయ్యప్ప కరుణ' సినిమా షూటింగ్
- శరత్‌బాబు మృతికి నివాళులర్పించిన అభిమానులు

నెల్లూరు(బృందావనం): సహజశైలిలో నటించడం ప్రముఖ నటుడు శరత్‌బాబుకే సొంతం. సినీ రంగంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించిన శరత్‌బాబుకు నెల్లూరుతో ప్రత్యేక అనుబంధం ఉంది. అయ్యప్పమాలధారణతో 18 పర్యాయాలు శబరిమలవాసుడిని దర్శించుకున్న శరత్‌బాబు అయ్యప్పస్వామి భక్తుడిగా ప్రధానపాత్ర పోషించిన 'అయ్యప్ప కరుణ' సినిమా షూటింగ్ ఎక్కువ భాగం నెల్లూరు నగరంలో, పరిసర ప్రాంతాల్లో 20 రోజులకు పైగా జరిగింది. సినిమా ఇద్దరు నిర్మాతల్లో ఒకరు రొంపిచెర్ల శివరామయ్య, దర్శకుడు మదన్‌మోహన్ నెల్లూరీయులు కావడం విశేషం. అలాగే మరొక నిర్మాత మనోహర్ ఒంగోలు వాసి. 'అయ్యప్ప కరుణ'చిత్రంలో ఇన్‌స్పెక్టర్ పాత్రధారిగా నెల్లూరు రూరల్ విశ్రాంత ఎంఈఓ సీహెచ్ రమేష్‌బాబు ఆ సినిమాలో నటించారు. ఆ షూటింగ్ సమయంలో వ్యక్తిగతంగా నటుడు శరత్‌బాబుతో తనకు ఉన్న అనుబంధాన్ని రమేష్‌బాబు ఇలా గుర్తుచేసుకున్నారు. శరత్‌బాబు సోమవారం మృతిచెందారన్న వార్త తెలుసుకున్న ఆయన అభిమానులు నివాళులర్పించారు.


షూటింగ్ విరామ సమయంలో నటుడు రంగనాథ్‌తో మాట్లాడుతున్న శరత్‌బాబు(ఫైల్)

మంచి నటుడిని కోల్పోయాం

శరత్‌బాబు తుదిశ్వాస విడిచారన్న సమాచారం తెలిసి ఎంతో బాధపడ్డాను. 1994వ సంవత్సరంలో 'అయ్యప్ప కరుణ' చిత్రం విడుదలైంది. 1988–1989 సంవత్సరాల మధ్య నెల్లూరు నగరంలోని అయ్యప్పస్వామి ఆలయం, పప్పులవీధి, అశోక్‌నగర్, నరసింహకొండ, జొన్నవాడ తదితర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరిగింది. షూటింగ్‌లో శరత్‌బాబు ప్రధాన పాత్రధారిగా పాల్గొన్నారు. నాకు ఈ సినిమాలో నటించే అవకాశం కలిగింది. మంచి నటుడిని కోల్పోవడం దురదృష్టకరం.

– సీహెచ్ రమేష్‌బాబు, నటుడు, విశ్రాంత ఎంఈఓ

బెల్లం ఊట ధ్వంసం

- నాటుసారా స్వాధీనం

కొడవలూరు: నాటుసారా కాస్తున్నారన్న సమాచారం మేరకు కోవూరు ఎస్‌ఈబీ అధికారులు దాడి చేసి 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతోపాటు 2 లీటర్ల నాటుసారా, 5 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మండలంలోని నాయుడుపాళెం మజరా గమళ్లపాళెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. ఎస్‌ఈబీ సీఐ ఆర్.నరహరిరావు తెలిపిన వివరాల మేరకు గమళ్లపాళెంలో నాటుసారా కాస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో అక్కడ నిఘా ఉంచారు. సూరగాని యానాదయ్య అనే వ్యక్తి ఇంట్లో నుంచి పొగ వస్తుండడాన్ని గుర్తించి తనిఖీ చేయగా యానాదయ్య నాటుసారా కాస్తున్నట్లు గుర్తించారు. 100 లీటర్ల బెల్లం ఊట, రెండు లీటర్ల నాటుసారా, 5 కిలోల బెల్లం గుర్తించారు. బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారాను, బెల్లంను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ ఎక్కడైనా నాటుసారా కాస్తున్నట్లు సమాచారం ఉంటే 9440902524 ఫోన్‌నంబర్‌కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడిలో ఎస్‌ఈబీ ఎస్సై టి.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసులు, ఎంజీకే రాజులు పాల్గొన్నారు.


నిందితుడిని అదుపులోకి తీసుకొన్న ఎస్‌ఈబీ అధికారులు

వాహనం ఢీకొని జింక మృతి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో 67వ నంబర్ జాతీయ రహదారి పక్కన సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతిచెందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ డీఆర్‌ఓ ఖాజారంతుల్లా తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకొని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి పశు వైద్యాధికారులతో పోస్టుమార్టం చేయించి అనంతరం ఖననం చేయించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ తాగునీటి కోసం జనావాసంలోకి వచ్చిన జింక ప్రమాదవశాత్తు గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందిందని, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించండి

- ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): 'స్పందన' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సంబంధించిన సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన' కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 94 మంది పాల్గొని తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. బాధితులు సమర్పించిన అర్జీలను పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సీనియర్ సిటీజన్ల హక్కులు పరిరక్షించి వారికి భద్రత కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. వరకట్న వేధింపులు, అనుమానాస్పద మృతి, హత్య, లైంగికదాడి కేసుల్లో లోతుగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలికితీయాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని తప్పిపోయిన వారిని కనుగొని బాధిత కుటుంబాలకు అప్పగించాలని తెలిపారు. ఆస్తులు పంచుకుని తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తూ వారిని పట్టించుకోని, ఆస్తుల కోసం వేధించే పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, వినని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉద్యోగాల పేరిట మోసాలు, ప్రేమపేరిట మోసగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన ఫిర్యాదులను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, నెల్లూరు రూరల్, ఎస్సీ, ఎస్టీ సెల్–2, ఏఆర్ డీఎస్పీలు పి.వీరాంజనేయరెడ్డి, శ్రీనివాసులు, గాంధీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బాధితుల సమస్య వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
Wanted Immediately
Principal, Vice Principal, Pre-Primary, Primary, High School All subjects Teachers, PET, PRO's, Spoken English, Office Boy, Ayahs, Van Drivers and Security
91777 61633, 99498 49758

BIOMED INTERNATIONAL
WANTED
1. Quality Manager
Qualification: M.Sc Chemistry (Male only)
Experience : Around 10 years (Documentation knowledge is essential)
2. Quality Control - Chemist
Qualification: M.Sc Chemistry (male/female)
Experience : Fresher / Experience
3. Production - Chemist
Qualification: B.Sc / M.Sc Chemistry (male only)
Experience : 4 - 5 years
4. Boiler Operator
Qualified with second class boiler certificate
Experience : 1 - 4 years
Local 10th Class or Inter fail or Polytechnic People Required
Location: Mekanur (v), Gudur (md), Tirupathi (Dt). A.P - 524410.
Mail id: info@biomedintl.com, biomedqa@gmail.com.
79891 32683
94936 21563, 94914 63163

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.22
పండ్లు	: రూ.15

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 139
లేయర్ (లైవ్)	: 98
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ చికెన్	: 167

జూదరుల అరెస్ట్

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని జేఆర్‌పేట నీటి ట్యాంకుల వెనుక వైపు శ్మశాన వాటిక వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఎస్సైలు ఎం.శివశంకర్‌రావు, బి.రాజేష్ అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో భాగంగా ఎస్సైలు తమ సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం ఆ ప్రాంతంలో పరిశీలిస్తుండగా పేకాట ఆడుతున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సైలు తెలిపారు.

బహిరంగ వేలం ప్రకటన

తేది: 20.05.2023

కలిగిరి మండలం వెలగపాడు గ్రామ పంచాయతీలోని వెలగపాడు చెరువు పరిధిలో 5525 సల్లతుమ్మ చెట్లు కలవు. శ్రీయుత డివిజనల్ ఫారెస్ట్ అధికారి సామాజిక అడవుల విభాగము నెల్లూరు వారి ప్రకారము మరియు శ్రీయుత డివిజనల్ పంచాయతీ అధికారి, కావలి వారి ఉత్తర్వుల ప్రకారం తేది: 31.05.2023న ఉదయం 11 గం॥లకు వెలగపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీయుత డివిజనల్ పంచాయతీ అధికారి, కావలి వారి సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించబడును. కావున వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.1,50,000/- (ఒక లక్ష యాభై వేల రూపాయలు) పంచాయతీ వారికి డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెను. మిగిలిన వివరములకు కార్యాలయము పని చేయు వేళలలో ఈ క్రింది వారిని సంప్రదించవలయును.

సం/- డి.తనూజ, పంచాయతీ కార్యదర్శి, వెలగపాడు గ్రామ పంచాయతీ, కలిగిరి (మం), శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా. సెల్: 63020 60887

యువకుడి దారుణ హత్య

- కోవూరు మండలం జమ్మిపాళెం మార్గంలో ఘటన

కోవూరు: తమ కన్నా ఎక్కువ ఇటుకలు కోస్తున్నాడన్న అక్కసుతో మాధవ్‌యాదవ్(20)ను అతని సహచరులు కూరగాయలు కోసే కత్తితో దారుణంగా పొడిచి హత్య చేసిన ఘటన కోవూరు మండలం జమ్మిపాళెం వెళ్లే మార్గంలో ఉన్న కృష్ణయ్య ఇటుకల బట్టీల వద్ద సోమవారం చోటుచేసుకొంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు ఒడిశా రాష్ట్రంలో బాలంగీర్ జిల్లా నుంచి రెండు కుటుంబాలు(9 మంది) ఐదు నెలల క్రితం జమ్మిపాళెం వెళ్లే మార్గంలో ఉన్న కృష్ణయ్య ఇటుక బట్టీల వద్ద ఇటుకలు తయారు చేసే కూలీ పనులకు వచ్చారు. వారిలో మాధవ్‌యాదవ్ ఒక గ్రూపుగా, జోగేందర్, పకీర్‌లు మరో గ్రూపుగా పనులు చేస్తున్నారు. అయితే మాధవ్‌యాదవ్ తమ కన్నా ఎక్కువ ఇటుకలు కోస్తున్నాడన్న విషయమై ఆదివారం ఇటుక బట్టీల వద్ద చిన్నపాటి గొడవ జరిగింది. ఈ గొడవకు సంబంధించి ఇటుక బట్టీల యజమాని కృష్ణయ్యకు తెలియజేయగా ఆయన ఇరుపక్షాల వారిని పిలిచి మందలించారు. ఈ క్రమంలో జోగేందర్, పకీర్‌లు సోమవారం మాధవ్‌యాదవ్‌ను ఇంట్లో ఉన్న కూరగాయలు కోసే కత్తితో అతి దారుణంగా పొట్టపైన, వీపు భాగంగా పొడిచారు. దీంతో మాధవ్‌యాదవ్ ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు. జోగేందర్, పకీర్‌లను అడ్డుకోబోయిన మాధవ్‌యాదవ్ కుటుంబసభ్యులపై కూడా వారు కత్తితో దాడి చేయబోయారు. అక్కడి నుంచి తప్పించుకున్న మాధవ్‌యాదవ్ కుటుంబసభ్యులు కోవూరు పోలీసులకు తెలియజేయడంతో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హత్యకు పాల్పడిన జోగేందర్, పకీర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి మృతి కేసులో ఐదుగురి అరెస్ట్

- అక్రమ విద్యుత్ తీగ తగిలి మృతిచెందిన వైనం

ఆత్మకూరు: అడవి జంతువులను చంపేందుకు అక్రమంగా విద్యుత్ తీగలను ఏర్పాటు చేయగా ఆ విషయం తెలియని ఆత్మకూరు శాంతినగర్‌కు చెందిన నక్కా తిరుపతయ్య(37) ఆ తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి ఐదుగురు వ్యక్తులు ఇలా అక్రమంగా విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారని గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ మేరకు స్థానిక సీఐ కార్యాలయంలో డీఎస్పీ ఎన్.కోటారెడ్డి, ఇన్‌చార్జి సీఐ రవినాయక్ సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పందులను మేపుకొని జీవించే నక్కా తిరుపతయ్య గురువారం రాత్రి తన రెండు పందులు తప్పించుకుపోవడంతో మిత్రుడు నక్కా వెంకటేశ్వర్లుతో కలిసి వాటిని వెతుక్కుంటూ శాంతినగర్ ఉత్తరంవైపు శ్మశాన వాటిక వైపు వెళ్లాడు. అయితే ఆ సమీపంలో కొందరు బొగ్గు బట్టీల వద్ద అడవి జంతువులను చంపేందుకు 11 కేవీ విద్యుత్ స్తంభం నుంచి అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. పందులను వెతుక్కొనే క్రమంలో ఆ విద్యుత్ తీగ తగిలి నక్కా తిరుపతయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని తిరుపతయ్య మిత్రుడు వెంకటేశ్వర్లు బంధువులకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారణ జరిపి అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన కనుపూరుపల్లికి చెందిన ఇండ్ల శీనయ్య, తిమ్మసముద్రానికి చెందిన ఏలూరు శ్రీనివాసులు, మొగళ్లూరుకు చెందిన మేకల మహేష్, వందూరుగుంటకు చెందిన సోమా శీనయ్య, చేజర్లకు చెందిన గంధళ్ల వెంకటరమణయ్య అనే ఐదుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ విషయంలో ప్రత్యేకంగా దర్యాప్తు చేసి నిందితులను గుర్తించిన ఇన్‌చార్జి సీఐని, ఎస్సైలను డీఎస్పీ అభినందించారు. ఎస్సైలు సాయిప్రసాద్, బి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కోటారెడ్డి, పక్కన సీఐ రవినాయక్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■10th, Inter,BA,B.Com,B.Sc,BBA, BCA, B.Lis,MA,M.Com,M.Sc,MCA,MBA, M.Lis, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D, BNYS, BPT పూర్తి చేసుకోవచ్చు. ✆ 9030030125. [T-4298]

DIRECT FINAL YEAR
■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629 [T-4296]

REAL ESTATE
■కాకుపల్లిలో అం॥ 75వేలు, 6వ మైలు అం॥ 80వేలు, యనమలపాళెం, అల్లీపురం రోడ్ అం॥ 1లక్ష 25వేలు, ఇల్లు 75 లక్షలు, పద్మావతి గ్రీన్ సిటీ విల్లా 1 కోటి 15 లక్షలు. 90147 85919. [NA-10562]

FLAT FOR SALE
■నెల్లూరు వెంకటరెడ్డి నగర్ కామాక్షమ్మ గుడి దగ్గర Lucky Enclave లో 1600 Sft 3 BHK, 1500 sft 2 BHK అపార్ట్‌మెంట్లు అమ్మబడును. వివరాలకు సంప్రదించండి. సెల్: 98664 99009. [NA-5611]

PLOT FOR SALE
■సమ్మర్ ఆఫర్ : లోనుతో ప్లాటు. తర్వాత ఇంటికి లోను. కేవలం 50వేలు అడ్వాన్స్‌తో నెల్లూరులో ప్లాటు బుక్ చేసుకోండి. ఆఫర్‌లో 5 గ్రాముల ఫ్రీ గోల్డ్ కాయిన్. సెల్: 79954 34866. [NA-22104]

TO-LET
■బి.వి.నగర్, బ్యాంక్ కాలనీలో 1800 Sft కలిగిన రెండు 2 BHK ఇల్లులు మరియు 1 BHK ఇల్లు మొత్తంగా గానీ, విడివిడిగా కానీ బాడుగకు ఇవ్వబడును. సెల్: 70131 32741. [NA-22106]

SERVICES

GOLD FINANCE
■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781973]
■ వివిధ తాకట్టు సంస్థలు, బ్యాంకులు నుండి బంగారు నగలు విడిపించి అమ్మి రొక్కం ఇప్పించబడును. బంగారు నగలు హోల్‌సేల్ రిటైల్‌తో సరఫరా చేయబడును. ఫోన్ : 77290 47122 [V- 6615]

TRAINING
■ విక్టోరియాస్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ నేర్పించబడును. స్త్రీలకు మాత్రమే. సెల్: 7801054610. Online Classes చెప్పబడును. [NA-5599]

WANTED
■Wanted Lady Primary Teachers for English, Hindi & Maths Subjects. Further Details Contact 95734 82607. [N-1231423]
■Wanted Female Receptionist & Male Fitness Trainer. Further Details Contact : 90300 21983, 90301 11935. [NA-22056]
■Wanted Qualified Primary Teachers to teach English, Science, Social & Hindi. Further Details Contact: B.V. Nagar, Nellore. Cell : 91771 61737. [NA-11449]
■Wanted System (M/F) Operators. Qlf: Degree Freshers. No experience. Time: 9:30AM to 6:30 PM. Location: Nellore Town only. Cont: 72888 03402, 90307 43622. [NA-5612]
■Wanted Teachers to Teach Telugu, Hindi, EVS & Maths Subjects 1 to 7 Classes. salary : 12000. Further Details Contact : 63034 39646, 70952 76553. [NA-5613]
■Wanted Teachers for English, Hindi, Biology and P.E.T in Higher Sections and computer operator for office. Sage High School. Cell:91105 72349, 93924 31909. [NA-5625]
■Wanted Pre School Teachers & I to V Class Teachers. Fluency in English. School , FCI Colony, Nawab pet, Nellore. Cell : 85001 00319. [NA-10563]
■ Job Vacancy: Age:18 to 30, 10th to Any Degree, Office Job 18000 to 25000/- work from home 15000 to 18000/- ✆ 6305444583. [T-774041]
■Wanted Computer Operator, Marketing Manager,TeleCallers, Nurses(min2yrs exp). Attractive Salary & Allowance. Interview Wed11am-5pm.24/5/2023.ChennaiHospital Information Centre. NLR. 93999 99951. [N-1189410]
■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786332]
■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000- 20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర: 6302029437 [G-1152541]
■నెల్లూరులో లోకల్‌లో తిరుగుటకు కార్ డ్రైవర్ కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్: 83284 91927, 98660 86696. [NA-22127]
■స్టేట్ బ్యాంక్ గ్రూప్ నందు పని చేయుటకు ఉద్యోగ - ఉపాధి అవకాశముల కొరకు మండలాల వారీగా (M/F) కావలెను. (పార్ట్/ఫుల్ టైం). సంప్ర: 96768 64933. [N-1231424]
■ప్రముఖ లైఫ్ ఇన్సూరెన్స్ కం॥ లి॥ నెల్లూరు పార్ట్ టైం జాబ్స్ మరియు బిజినెస్. వ: 30- 65. జీతం మరియు ఇన్సెంటివ్స్ కలవు. మహిళలు, రిటైర్డ్ ఎంప్లాయిస్‌కి ప్రాధాన్యత. 76809 24379. [N-781554]
■నెల్లూరు జిల్లాలోని అన్ని ఏరియాలలో పర్సనల్ లోన్ డిపార్ట్‌మెంట్‌లో పని చేయుటకు యువకులు కావలెను. (జీతం + కమీషన్). వివరాలకు సంప్రదించండి: 93470 27206. [NA-11451]
■నెల్లూరు, సంతపేటలోని ప్రముఖ వాటర్‌ప్లాంట్ నందు వాటర్ క్యాన్లు డెలివరీ చేయుటకు ఆటో డ్రైవర్లు ఇద్దరు (జీతం: 18,000) & హెల్పర్లు (జీతం: 12,000) కావలెను. 83286 66341. [NA-5626]
■సెక్యూరిటీ గార్డ్స్ కావలెను (నెల్లూరులో). 12 గం॥ డ్యూటీ. జీతం: 11,000 + బోనస్. 45 సం॥ లోపు వయసు ఉండాలి. వివరాలకు సంప్ర: 72880 04466, 72880 08855. [NA-11452]
■ఫ్రాంచైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మా సంస్థను మీ జిల్లాలో అభివృద్ధి చేయగలిగేవారు కావలెను. Mega Group Man Power& Security. Conact: 70326 10569, 70931 25169. [NA-5620]
■5 సం॥ అనుభవమున్న లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కం అకౌంటెంట్ కావలెను. (9AM - 7PM, 20వేలు జీతం) Qlf: Degree - PG, Mega Mart, BV Nagar. Cell:72075 96519. [NA-5616]
■నెల్లూరు టౌన్‌లో కూలింగ్ వాటర్ ప్లాంట్ నందు వాటర్ క్యాన్లు డెలివరి చేయుటకు ఆటో డ్రైవర్లు, హెల్పర్లు కావలెను. జీ: 12000 - 15000. ఉచిత వసతి కలదు. 91820 09306. [NA-22066]
■నెల్లూరు మినీ బైపాస్ రోడ్డు TDP ఆఫీసు ఎదురుగా HPCL పెట్రోల్ బంకులో 24 గం॥, నైట్ డ్యూటీ చేయుటకు పంప్‌బాయ్స్ కావలెను. జీతం: 13000/-. 8919923469, 8341828889. [NA-22101]
■హిమక్రీమ్ ఐస్‌క్రీమ్ షాపు నందు పని చేయుటకు స్త్రీలు కావలెను. జీతం: 9000/-. రూం +ఆటో చార్జీలు + భోజనం ఫ్రీ. నెల్లూరు. వివరాలకు సంప్రదించండి : 78010 34111. [NA-22118]
■I to V, VI to X సబ్జెక్ట్ టీచర్లు కావలెను. Q: B.Ed, T.T.C. స్కూల్‌లో ఉండి పని చేయుటకు డ్రైవర్లు, క్లీనర్లు, ఆయాలు కావలెను. శ్రీ బాలాజీ విద్యా మందిర్, నరుకూరు. 88858 62960. [NA-22124]
■నెల్లూరు బోసుబొమ్మ దగ్గర గల RKT పెట్రోలు బంకులో పని చేయుటకు యువతీ, యువకులు కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్: 95501 89885. [NA-5607]
■ SBI అనుబంధ సంస్థలో పని చేయుటకు రిటైర్డ్ ఎంప్లాయిస్, ప్రైవేట్ ఎంప్లాయిస్, గృహిణులు, పోస్టల్ , చిట్స్ ఏజెంట్స్, రియల్ ఎస్టేట్ పీపుల్స్ కావలెను. జీతం: 15k - 30k. 73308 81999. [NA-22109]
■ మైపాడు బీచ్ రోడు 4వ మైలులోని RR Unicorn రెస్టారెంట్‌లో క్లీనింగ్ చేయుటకు లేడీస్/జెంట్స్ వర్కర్స్ కావలెను. టై: 7:30- 4:30, 4:30 -11:00. సెల్: 90009 21707, 90009 25717. [NA-22110]
■ప్రముఖ యూనివర్సిటీ ఆఫీసు నందు పని చేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. జీ: 12k to 15k+ఇన్సెంటివ్స్. వివరాలకు సంప్రదించండి. సెల్: 90100 96000, 90300 50505. [NA-22105]
■నెల్లూరు టౌన్‌లో హోల్‌సేల్ ఏజెన్సీ నందు పని చేయుటకు లేడి స్టాఫ్ కావలెను. అర్హత : ఇంటర్ లేదా డిగ్రీ. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్: 88857 99404. [NA-22103]
■ ముత్తుకూరు ప్రవంతి రెస్టారెంట్‌లో పనిచేయుటకు కటింగ్ మాస్టర్ కావలెను. జీతం : 20,000/- + రూం + ఫుడ్ కలదు. అసిస్టెంట్ కుక్ కావలెను. జీతం : 18,000/- + రూం+ఫుడ్ కలదు. ఫోన్: 83099 15445, 94903 19998 [V- 6139]
■ లేపాక్షి హెల్త్‌కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్ : 9640400073 [HA-181]
■వెటర్నరీ రంగంలో నెల్లూరు జిల్లా చుట్టు పక్కల మండలాలలో పని చేయుటకు అనుభవం కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. Qlf: డిగ్రీ మరియు డైరీ సైన్స్. సెల్: 76720 36639, 0861-3563368. [NA-5622]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.